తేదీ 25.12.2003, క్రిస్మస్, సాయికుల్వంత్ సభామండపం

# దేహభ్రాంతిని త్యజిస్తే నీవే దైవం

**ఏ గుణంబు గణించి ఏతెంచెనో నాడు**
**ప్రహ్లాదు పాలింప పరమ పురుషు**
**డే గుణంబు గణించి ఏతెంచెనో నాడు**
**పేద కుచేలు బ్రోవ వేదచరితు**
**డే గుణంబు గణించి ఏతెంచెనో నాడు**
**కరినిగాచెడి తరి కమలనయను**
**డే గుణంబు గణించి ఏతెంచెనో నాడు**
**బలి చక్రవర్తి గావంగనోర్చి**
**ఆ గుణంబె గణించి ఆ అమరవంద్యు**
**డార్తజననాథు డీనాడు అవతరించె**
**శ్రీనివాసుండు లోకైక చిన్మయుండు**
**వెల్గె పర్తీశుడై నేడు పృథివియందు**

ప్రేమస్వరూపులారా! భగవంతుడు ఎక్కడున్నాడు? ఎప్పుడు అవతరిస్తాడు? ఎట్లా అవతరిస్తాడు? అని అనేకమంది ప్రశ్నిస్తుంటారు. భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు. సర్వులూ భగవత్స్వరూపులే! మానవునియొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములే భగవత్స్వరూపాలు. భగవంతునికి ఆది లేదు, అంత్యమూ లేదు. అయితే, పామరులైన మానవులలో విశ్వాసమును పెంపొందించే నిమిత్తం తాను దేహమును ధరిస్తుంటాడు. పుట్టుట ఉంటే గిట్టుటకూడా ఉంటుంది కదా! భగవంతునికి పుట్టుట, గిట్టుట రెండూ లేవు. కాని, భక్తులు దేహమును మాత్రమే దృష్టిలో పెట్టుకొని రాముడు పుట్టినదినమనీ, కృష్ణుడు పుట్టినదినమనీ,

sri sathyasaivachanamrutam

జీసస్ పుట్టినదినమనీ వేర్వేరు పేర్లతో భగవంతుని వర్ణిస్తూ ఆరాధన చేస్తున్నారు. ఈవిధముగా చెప్పుకొని ఆరాధన చేసినంతమాత్రమున అవి నిజంగా భగవంతుని 'బర్త్‌డే'లు అవుతాయా? సంవత్సరమునకు ఒకతూరి భగవంతుని 'బర్త్‌డే' వస్తుందని భావించడం పొరపాటు. ఇది కేవలం భక్తుల భ్రమయేగాని, సత్యము కాదు.

లోకములో నిత్యం ఎందరో జన్మిస్తున్నారు, ఎందరో మరణిస్తున్నారు. అసలు జననమంటే ఏమిటి? మరణ మంటే ఏమిటి? దేహము కనిపించడమే జననం, కనిపించకుండాపోవడమే మరణం. జననమరణములు రెండూ భగవత్ సంకల్పములే! భగవంతుడు లేని స్థానము లేదు.

**సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి**

ప్రేమమూర్తి అయిన భగవంతుడు సర్వులయందు ఉచ్ఛ్వాసనిశ్వాసముల రూపంలో కనిపిస్తూనే ఉన్నాడు. అనాదికాలమునుండి మానవుడు జనన మరణముల రహస్యాన్ని గుర్తించే నిమిత్తం అనేక శాస్త్రములను అధ్యయనం చేస్తూ, అనేక పరిశోధనలు సల్పుతూ వచ్చాడు. అయితే, అంతవరకు మనం పోనక్కర్లేదు. మనం ధరించినటువంటి దేహం క్షణక్షణమూ జనన మరణములను చూపుతూనే ఉన్నది. మనం శ్వాసను పీల్చుకున్నప్పుడు ప్రాణము మనలోనికి ప్రవేశిస్తున్నది. శ్వాసను వదలినప్పుడు ప్రాణము బయటికి పోతున్నది. కాబట్టి, శ్వాసను పీల్చుకోవడమే Birth (జననం), శ్వాసను విడిచిపెట్టడమే Death (మరణం). దేహములో శ్వాస ఉన్నంతవరకు ఇది 'శివం' ; శ్వాస పోతూనే అది 'శవం'.

మన ఉచ్ఛ్వాసనిశ్వాసములు అనుక్షణం 'సో**2**హం' (నేనే దైవం) అంటూ మన నిజతత్త్వాన్ని బోధిస్తూనే ఉన్నవి. కాబట్టి, జనన మరణములు దేహమునకేగాని, ఆత్మకు కాదు. ఈ రెండింటి మధ్య ఎన్నో మార్పులు జరుగుతున్నాయి. భగవత్సంకల్పమే దీనికంతటికీ కారణం. కాని, భగవంతుడున్నాడని కొందరు, లేడని కొందరు వాదోపవాదములలో ప్రవేశించి కాలహరణం గావిస్తున్నారు. భగవంతుడు **ఉన్నాడు**. ఎప్పటికీ ఉన్నాడు. పోవడం, రావడం అనేది లేదు. మానవుడు జననమరణములనుండి



sri sathyasai vachanamrutam

విముక్తి పొందవలెనంటే దేహాభిమానమును త్యజించి భగవంతునికి తన హృదయమును అర్పితం గావించాలి.

**"ఏ హృదయము నొసంగితివో ఈశ నాకు**
**మగిడి దానినే యర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేమి తెత్తు నీ పాదార్చనకును**
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు"**

ఒక పర్యాయం ఆదిశంకరులవారు తన శిష్యులతోకూడి గంగానదికి వెళుతున్నప్పుడు మార్గమధ్యంలో ఒక చెట్టుక్రింద ఒక వ్యక్తి కూర్చొని, 'డుకృఙ్ కరణే, డుకృఙ్ కరణే...' అంటూ పాణినీ వ్యాకరణ సూత్రాన్ని వల్లెవేస్తున్నాడు. శంకరులవారు అతని వద్దకు వెళ్ళి,

**"భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఙ్ కరణే"**

"నాయనా! గోవిందుని భజించు. అంత్యకాలమాసన్నమైనప్పుడు 'డుకృఙ్ కరణే' నిన్ను కాపాడదు,' అని బోధించారు.

**దేహమే నేనను భ్రాంతియే బాధలకు మూలం**

కాలులో ముల్లు ఉండినంతవరకు బాధ తప్పదు. ముల్లును తీసిపారవేస్తిమా, ఇంక బాధ ఉండదు. అదేవిధముగా, దేహమే నేనను భ్రాంతిచేత నీవు బాధ పడుతున్నావు. ఈ దేహభావమును త్యజిస్తే దుఃఖము తొలగిపోతుంది; నీవెవరో నీకు తెలుస్తుంది. సుఖ దుఃఖములు, జననమరణములు కేవలం నీ భ్రాంతుల చేతనే ఏర్పడుతున్నాయి. శంకరులవారు చెప్పారు:

**"పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం**
**ఇహ సంసారే బహు దుస్తారే కృపయా పారే పాహి మురారే!"**

జననమరణములు నీ భ్రాంతులేగాని, సత్యమైనవి కావు. ఇవి కాలమును అనుసరించి జరిగిపోతుంటాయి. ఈ రెండింటిమధ్య నీవు అనేకరకములైన సంబంధ బాంధవ్యములను పెంచుకుంటున్నావు. దేహము ఉండినంతవరకు 'నేను, నావారు' అనే భ్రమలో

srisathyasaivachanamrutam

మునిగిపోతున్నావు. దేహము పోతూనే ఈ సంబంధ బాంధవ్యములేమవుతాయి? ఆయన నీవు పుట్టక పూర్వం ఉన్నాడా? పోయిన తరువాత నీకు కనిపిస్తాడా? ఈ ప్రాకృతమైన భ్రాంతులలో మునిగి నీవు పరతత్త్వమును అర్థం చేసుకోవడం లేదు. ముందు నీవెవరో గుర్తించుకోవడానికి ప్రయత్నించాలి. అదే నిజమైన సాధన. నేనెవరు? అనే సత్యాన్ని తెలుసుకోవాలి. సమస్త సాధనల లక్ష్యం ఇదే! నీయందున్న 'నేనే' సర్వులయందున్నది. కాని, నీవు ఈ ఏకత్వాన్ని గుర్తించుకోలేకపోతున్నావు. 'నీవు, నేను' అను భేద భావములకు చోటిచ్చి అశాంతికి గురి అవుతున్నావు.

**బ్రహ్మ కనిపించాలంటే భ్రమ తొలగాలి**

ప్రేమస్వరూపులారా! జననమరణములు దేహమునకేగాని, జీవునకు లేవు. ఇవి కేవలం మనస్సుయొక్క కల్పనలే! ఈ జీవితమే ఒకవిధమైన కల. కలలో కనిపించేది సత్యమెలా అవుతుంది? ఇవన్నీ కూడా భ్రాంతులే! భ్రమ ఉన్నంతవరకు బ్రహ్మ కనిపించడు. మీయందు భ్రమ చేరిపోవడంచేతనే మీకు బ్రహ్మ దూరంగా ఉన్నట్లు కనిపిస్తున్నాడు. బ్రహ్మయే మీరనే సత్యాన్ని గుర్తించినప్పుడు భ్రమ ఉండనే ఉండదు. నిజంగా బ్రహ్మ మీయందే ఉన్నాడనే సత్యాన్ని తెలుసుకోవడం చాలా సులభం. కాని, దేహమే నేనను భ్రాంతిచేత మీరు దుఃఖమునకు గురి అవుతున్నారు. దేహాభిమానమును త్యజిస్తే ఇంక ఏ చింతా ఉండదు. నిత్యానందమును అనుభవించగలరు. మిమ్మల్ని మీరు తెలుసుకొనుటకు ఏ సాధనలూ చేయనక్కర్లేదు. మీ ఉచ్ఛ్వాసనిశ్వాసములను గమనిస్తే మీరెవరో గుర్తించవచ్చు. కాని, మీరు ఇలాంటి సులభమైన మార్గమును వదలి కష్టమైన మార్గములో ప్రవేశించి జీవితముపట్ల విసుగుచెందుతున్నారు.

ఒక వ్యక్తికి ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో తాను మరణించినట్లు అనుభూతి పొందుతున్నాడు. అక్కడ 'నేను మరణించాన'ని బాధపడుతున్నాడు. కాని, లేచి చూచేటప్పటికి తాను దేహముతో ఉన్నాడు. మరి స్వప్నంలో మరణించినది ఎవరు? అది కేవలం మనోకల్పన. అట్లే, జాగ్రదవస్థలో కనిపించేది కూడా మనోకల్పనయే! నా తల్లి, నా తండ్రి, నా బిడ్డ, నా కుమారుడు.... ఇవన్నీ భ్రాంతులే! ఈవిధమైన భ్రాంతులను సృష్టించుకొని, పెంచుకొని మానవుడు అనేక కష్టములకు గురి అవుతున్నాడు.

sri sathyasai vahini amrutam

నిత్యసత్యమైన ప్రేమను పెంచుకున్నప్పుడు తాను సుఖదుఃఖములకు అతీతమైన స్థితికి చేరుకుంటాడు. శారీరకసంబంధమైన ప్రేమ అసత్యమైనది. ఆత్మసంబంధమైన ప్రేమయే సత్యనిత్యమైనది. అటువంటి ప్రేమను పెంచుకోవాలి. అందరినీ ప్రేమించాలి. కాని, మానవుడు ఆవిధంగా ప్రేమించడం లేదు. అయితే, తనయందు ప్రేమ లేదా? ఉన్నది. కాని, దానిని అనుభవించలేక పోతున్నాడు. మనం విలువనివ్వవలసింది ప్రేమకేగాని, ప్రాకృతమైన విషయాలకు కాదు.

**సుఖదుఃఖములు మీరు కల్పించుకున్నవే!**

ప్రేమస్వరూపులారా! సుఖదుఃఖములు రెండూ మీయందు పుట్టినవేగాని, బయటినుండి వచ్చినవి కావు. ఇవి మీరు కల్పించుకున్నవేగాని, భగవంతుడు ప్రసాదించినవి కావు. ఈ జగత్తులో మీకు బాధలు కల్పించేవారు ఎవ్వరూ లేరు. మీరే కల్పించుకొని మీరే బాధపడుతున్నారు. ఆధ్యాత్మికదృష్టితో చూసినప్పుడు సుఖదుఃఖములు, శారీరకమైన సంబంధబాంధవ్యాలు అన్నీ భ్రాంతులే అని స్పష్టమౌతుంది. తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంతవరకు ఈ భ్రాంతులలో మునిగి మీరు జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు. దేహము పెరుగుతుంది, తరువాత క్రుంగుతుంది. పుట్టటము, పెరగటము ఇవన్నీ అసత్యములే! ఈ ప్రపంచములో కనిపించేది ఏదీ సత్యము కాదు. మీరు కన్నులు తెరచి చూసినప్పుడు వేలాది శిరస్సులు కనిపిస్తున్నాయి. కన్నులు మూసుకుంటే ఒక్క శిరస్సైనా కనిపించడం లేదు. ఆ శిరస్సులన్నీ ఎక్కడినుండి వచ్చినాయి? ఎక్కడికి పోయినాయి? ఎక్కడినుండి వచ్చినాయో అక్కడికే పోయినాయి. ఎక్కడినుండి వచ్చినాయో మీకు తెలియదు. ఎక్కడికి పోయినాయో మీకు తెలియదు. అసలు మీరెవరో మీకు తెలియదు. ఈ దేహము మీరు కాదు. కాని, దేహాన్ని పట్టుకొని మీరు బాధపడుతున్నారు. ఎంత వెఱ్ఱితనము! 'దేహము నేను కాదు', 'ఏదీ నాది కాదు' అనే సత్యాన్ని మీరు గుర్తించుకున్నప్పుడు మీకు ఎట్టి బాధలూ ఉండవు. భ్రమచేత మీరు అన్నీ కల్పించుకొని బాధపడుతున్నారేగాని, సత్యమైనది ఈ జగత్తులో ఏ ఒక్కటీ లేదు.

**దేహాభిమానము తగ్గించుకోవడమే సరియైన సాధన**

ప్రేమస్వరూపులారా! ప్రేమ ఒక్కటే మన ఇంటా వెంటా జంటా ఉంటున్నది. ప్రేమ

srisathyasaivachanamrutam

లేకపోతే మానవుడే లేడు. ప్రేమయే మనకు నిజమైన ప్రాణము. ప్రేమయే Life. ప్రేమయే Light. ప్రేమ అనే లైటును మనం దగ్గర పెట్టుకుంటే అజ్ఞానమనే చీకటి దూరమైపోతుంది. ఏది కనిపిస్తున్నదో అది కనిపించకుండా పోతుంది. ఏది కనిపించకుండా ఉన్నదో అది కనిపిస్తుంది. ప్రేమను పెంచుకో నంతవరకు, "పునరపి జననం పునరపి మరణం," అన్నట్లు జననమరణాలనుండి విముక్తి లభించదు. వచ్చిపోయే ప్రేమ ప్రేమ కాదు. నిజమైన ప్రేమ శాశ్వతమైనది. ఈ దేహము పెరుగుతున్నది, తరుగుతున్నది. ఈ పెరిగి, తరిగే దేహతత్త్వమును మీరు సత్యమని భావిస్తున్నారు. సర్వ భ్రాంతులకూ ఈ దేహమే మూలకారణము. కనుక, దేహాభిమానమును తగ్గించుకోండి. అదియే సరియైన సాధన. సాధన అనగా జప, తప, ధ్యానాదులను ఆచరించడం కాదు. దేహమే నేనను భావమును వదలిపెట్టాలి. అది వదలిపెట్టటం చాలా సులభం. కాని, మీరు వదలిపెట్టలేక ఎందుకింత బాధపడుతున్నారో నాకర్థం కావడం లేదు. జనన మరణములకు మీ భ్రాంతులే మూలకారణం. కాబట్టి, ఈ భ్రాంతులను వదలుకోవడానికి ప్రయత్నించండి. కలలో కనిపించే దృశ్యములవలె ఈ లౌకికభ్రాంతులు మిమ్మల్ని తబ్బిబ్బు చేస్తున్నాయి. ఈ భ్రాంతులను తగ్గించుకొనే కొలదీ మీలో దేహాభిమానము పూర్తిగా నశిస్తుంది. అదియే నిజమైన సాధన. ఇక్కడ చూడండి, ఎన్నో బల్బులు వెలుగుతున్నాయి. ఈ బల్బులన్నింటిలోనూ ఒకే కరెంటు ప్రసరిస్తున్నది. అదేవిధముగా, దేహములనే బల్బులలో ప్రసరించే ఆత్మతత్త్వమనే కరెంటు ఒక్కటే! అది మాత్రమే సత్యమైనది. ఇట్టి ఏకత్వమును గుర్తించి ప్రేమను అభివృద్ధిపరచుకోండి. అందరినీ ప్రేమించండి. ఎవ్వరినీ మీకు శత్రువులుగా భావించవద్దు. మిమ్మల్ని ప్రేమించేవాడు మీ మిత్రుడని, ద్వేషించే వాడు మీ శత్రువని మీరు భావిస్తున్నారు. కాని, మీకు మిత్రులుగాని, శత్రువులు గాని లేరు. ఇవన్నీ మీ భ్రమలే!

**'నేనే దైవం' అని దృఢంగా విశ్వసించండి**

ఈనాడు భగవంతుని తత్త్వాన్ని గుర్తించుకోవాలని ఎంతోమంది ఎన్నియో సాధనలు చేస్తున్నారు. ఏమిటీ సాధనలు? ఈ సాధనలు చేసినంతమాత్రమున భగవంతుడు మీకు

sri sathyasai vahamrutam

దగ్గరగా వస్తున్నాడా? చేయకపోయినంతమాత్రమున మీకు దూరంగా పోతున్నాడా? ఏమీ లేదు. ఈ సాధనల ఫలితంగా మీ భ్రమలు దూరమౌతున్నాయి; మీరు బ్రహ్మకు చేరువవుతున్నారు. కాబట్టి, ఈ భ్రాంతులను పోగొట్టుకోవడానికి తగిన ప్రయత్నం చేయండి. 'దేహమే నేను' అను భ్రాంతిని వదలుకోండి. అప్పుడింక మీకెట్టి భయభ్రాంతులూ ఉండవు. ఈనాడు మీరు చేయవలసిన సాధన ఏమిటి? ధ్యానములో కూర్చోవడం కాదు, జపములు చేయడం కాదు. 'నేనే దైవం, నేనే దైవం' అని దృఢంగా విశ్వసించండి. మీరే దైవమైపోతారు. ఈ దేహము మీరు కాదు, ఇది మీరు ధరించిన వస్త్రము. దీనిని ఏనాడైనా విడిచిపెట్టక తప్పదు. కనుక, దేహాభిమానమును పెంచుకుంటే దుఃఖము మరింత పెరిగిపోతుంది.

**త్యాగమే యోగము, భోగమే రోగము**

ఈ లోకములో మీకు అనేకమంది కనిపిస్తున్నారు. అయితే, ఈ కనిపించే వారంతా వేరువేరా? కానే కాదు. అందరూ ఒక్కటే. ఒకే ఆత్మతత్త్వము ఇన్ని రూపాలను ధరిస్తున్నది. తల్లీ తానే, తండ్రీ తానే, బిడ్డా తానే, అక్కా తానే, చెల్లెలూ తానే. వేరువేరు పేర్లతో పిలుస్తున్నాముగాని, సత్యము ఒక్కటే. ఈ సత్యాన్ని మనం దృష్టిలో పెట్టుకుంటే మననుండి ప్రేమ నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. ఆ ప్రేమప్రవాహంలో మునిగిపోవాలి. ఎట్టి పరిస్థితియందైనా ప్రేమను మాత్రం మార్చుకోకండి. మిమ్మల్ని ద్వేషించేవానిని కూడా ప్రేమించండి. వాడు ఎక్కడైనా ఎదురైతే వానిపట్ల ద్వేషం ప్రదర్శించకండి. 'వీడు నా ద్వేషి' అనుకుంటే తక్షణమే మీలో కూడా ద్వేషం ఆవిర్భవిస్తుంది. 'వీడు నావాడే, నా తమ్ముడే' అని భావించుకోండి. వానిని ప్రేమతో పలుకరించండి. మీ ప్రేమ తప్పక వానిలో మార్పు తెస్తుంది. నిజమైన ఆనందము ఒక్క త్యాగములోనే ఉన్నది. త్యాగమే నిజమైన యోగము. కాని, మానవుడు త్యాగమును పెంచుకోకుండా భోగములో మునిగి రోగాన్ని పెంచుకుంటున్నాడు. త్యాగముద్వారానే మనకు బాధలనుండి విముక్తి లభిస్తుంది. మనం చేయవలసినది ఏమిటి? భ్రాంతులను వదలుకునే సాధన చేయాలి. ఈనాటి మానవునికి వయస్సు పెరిగేకొలదీ భ్రాంతులు కూడా పెరుగుతున్నాయేగాని, తరగటం లేదు. 'ఈ

srisathyasaivachanamrutam

దేహము నేను కాదు. ఏదీ నాది కాదు,' నీవు తెలుసుకోవలసింది ఇదొక్కటే. 'నేను ఎవరిని?' అని నిన్ను నీవు ప్రశ్నించుకో. నీయందున్న 'నేనే' నీవు. కాబట్టి, 'నేను నేనే' (I am I) అనే సత్యాన్ని గుర్తించు. అప్పుడు ఎవ్వరూ నిన్ను బాధించలేరు. 'నేను జీవుడిని. దేవుడు నాకంటే వేరుగా ఉన్నాడు,' అన్న ద్వైతభావమున్నంత వరకు బాధలు తప్పవు. 'నేను, నీవు' అనే భేదభావము మనం కల్పించుకున్నదే!

**మీ దృష్టిని అంతర్ముఖం చేసుకోండి**

ప్రేమస్వరూపులారా! ఈనాడు అనేకమంది జపము, ధ్యానము ఇత్యాది సాధనలు చేస్తూనే ఉన్నారు. కాని, ఇవన్నీ తాత్కాలికమైన సాధనలేగాని, సత్యమైనవి కావు. ఇవి తాత్కాలికమైన ఫలితాన్నే తప్ప శాశ్వతమైన ఆనందాన్ని అందించలేవు. తాత్కాలికమైన ఫలితాల కోసం మనం చింత చేయకూడదు. హరిని గుర్తించ నంతవరకు మీకు Worry (చింత) తప్పదు. 'ఈ దేహమే నేను' అనే భ్రాంతివలననే మీరు Worry పడుతున్నారు. 'నేను, నాది' అనే భావమే సకల చింతలకూ మూలం. 'ఈ దేహము నేను కాదు, నేను ఆత్మస్వరూపుడను' అనే సత్యాన్ని గుర్తించినప్పుడు మీకు బాధలే ఉండవు. 'ఇది నాది' అనుకున్నంతవరకు బాధలు తప్పవు. నాది కాదనుకున్నప్పుడు ఏ బాధలూ ఉండవు. కనుక, మీరు బాధలనుండి విముక్తి పొంది శాంతిని అనుభవించవలెనంటే 'నేను నేనే' అనే సత్యాన్ని గుర్తించాలి. ధనకనకవస్తువాహనాదులపట్ల అభిమానమును పెంచుకోకండి. త్యాగభావముతో మీరు జీవితాన్ని గడిపినప్పుడు అన్నివిధాలుగా ధన్యులౌతారు. మీరు సాధించవలసినది త్యాగమేగాని, భోగము కాదు. 'ఇది నాకు కావాలి,' అనుకోవడమే భోగము. 'ఇది నాది కాదు,' అనుకోవడమే యోగము. ఆ యోగమే మీకు నిజమైన బలమును చేకూర్చుతుంది. జీసస్ అనేక సాధనలు చేసి ఈ సత్యాన్ని గుర్తించాడు.

ఒకతూరి జెరూసెలంలో జరిగిన తిరునాళ్ళకు మేరీ, జోసెఫ్‌లు తమవెంట జీసస్‌ను తీసికొని వెళ్ళారు. ఆ జనసమ్మర్దంలో పిల్లవాడు ఉన్నట్లుండి ఎటో కనిపించకుండా పోయాడు. ఎక్కడికి పోయాడు? దేవాలయములో ప్రవేశించి అర్చకుడు బోధిస్తున్న ఆధ్యాత్మిక విషయాలను శ్రద్ధతో ఆలకిస్తున్నాడు. ఆ సంగతి తెలియక మేరీ, జోసెఫ్‌లు

srisathyasaivachanamrutam

ఆందోళనచెంది అతనికోసం వెతకడం ప్రారంభించారు. ఎక్కడ వెతికారు? ఆ దేవాలయము చుట్టూ వెతికారు. సూర్యాస్తమయమువరకు వెతుకుతూనే ఉన్నారు. కాని, జీసస్ కనిపించలేదు. చిట్టచివరికి మేరీ దేవాలయములోనికి ప్రవేశించగా జీసస్ కనిపించాడు. ఆమె ఆనందబాష్పాలు రాలుస్తూ పిల్లవానిని ఎత్తుకొని, "నాయనా! ఇంతసేపు ఎక్కడికి పోయివుంటివి? ఇప్పటివరకు మేము నీకోసం అన్నిచోట్ల వెతుకుతూనే ఉన్నాము. ఏమి చేస్తున్నావు?" అని అడిగింది. అప్పుడు జీసస్, "అమ్మా! నేను ఎక్కడికీ పోలేదు. అర్చకుడు బోధిస్తున్న విషయాలను శ్రవణం చేస్తూ ఇక్కడే దేవాలయంలో ఉన్నాను. ప్రపంచాన్ని నమ్మినవారికి భయముండాలిగాని, భగవంతుని నమ్మిన వారికి భయ మెందుకు? నేను నా తండ్రియైన భగవంతునితోనే ఉన్నాను. నీకు భయమెందుకు?" అన్నాడు.

అదేరీతిగా, ఈనాటి మానవుడు తనయందే ఉన్న దివ్యత్వముకోసం బయట వెతుకుతున్నాడు. తనయందే ఉన్నాడు భగవంతుడు. తానే భగవంతుడై ఉన్నాడు. కాని, మానవుడు తనలోపల వెతకటం లేదు; బయట వెతుకుతున్నాడు. తనకోసం తాను బయట వెతకడం ఎంత వెఱ్ఱితనం! నిన్ను నీవు బయట ఏవిధంగా చూడగలవు? చూడటానికి వీలేకాదు. అంతమాత్రముచేత నేను లేనని నీవనుకో గలవా? కనుక, భగవంతునికోసం బయట వెతికితే ప్రయోజనం లేదు. మీ దృష్టిని అంతర్ముఖం చేసుకోండి. అందరిలో ఉన్న 'నేను' అనే ఏకత్వమును గురించి తెలుసుకోవడం చాలా సులభమేగాని, దానిని మీరు నమ్మాలి బాగా. 'నేను' అనేదే దివ్యత్వము. అది మీయందే ఉన్నది. అంతేకాదు, దివ్యత్వము మీలోపలా, వెలుపలా, సర్వత్రా వ్యాపించియున్నది.

ప్రేమస్వరూపులారా! మీరు ముఖ్యంగా వెతకవలసింది ఏమిటి? మీయందే ఉన్న 'నేను'ను వెతకాలి. 'నేను' ఎవరో గుర్తించడమే నిజమైన సాక్షాత్కారము. అది తెలుసుకుంటే ఇంకే బాధలూ ఉండవు. మీ దృష్టిని అంతర్ముఖం గావించుకోకుండా మీకు భగవత్ సాక్షాత్కారం కాలేదని వగచితే ప్రయోజనమేమిటి? భగవంతుడు మీయందే ఉన్నాడు. ఒక వ్యక్తి ఒక పుస్తకం చదువుతూ అందులో ఒక పది రూపాయల నోటును పెట్టాడు. ఆ సంగతి మరచి తన స్నేహితుని వద్దకు వెళ్ళి, 'నాకు పది రూపాయలు కావాలి, ఇస్తావా?' అని

sri sathyasaivachanamrutam

అడిగాడు. 'ఇస్తాను, కూర్చో,' అని చెప్పి ఆ స్నేహితుడు అతని చేతిలో ఉన్న పుస్తకాన్ని చూసిస్తానంటూ తీసుకున్నాడు. అందులో అతనికి పది రూపాయల నోటు కనిపించింది. "నీ దగ్గరే పది రూపాయలు పెట్టుకొని నన్ను అప్పు అడుగుతున్నావేమిటి?" అన్నాడు. అదేవిధంగా, ఈనాటి మానవుడు తానే భగవత్స్వరూపుడనే సత్యాన్ని మరచిపోయి భగవంతునికోసం బయట వెతుకుతున్నాడు.

ప్రేమస్వరూపులారా! మీరు భగవంతుని దర్శించాలని ఎన్నో రకములైన భ్రాంతులతో ఎన్నో ప్రయత్నములు చేస్తున్నారు. భగవంతునికోసం బయట వెతకకండి. సర్వం మీయందే ఉంటున్నది. బయట కనిపించేదంతా మనో కల్పనయే! అదే సత్యమని భ్రమించకండి. అప్పుడే మీకు శాంతి కలుగుతుంది. "నేను నేనే" అనే సత్యం తెలుస్తుంది. ఈ చిన్న విషయాన్ని తెలుసుకోవడానికి మీరు చాలా గ్రంథాలు చదువుతున్నారు, సాధనలు సలుపుతున్నారు. ఈ సాధనలను, పుస్తకాలను ప్రక్కకుపెట్టండి. దృష్టిని అంతర్ముఖం చేసుకొని 'నేను' ఎవరో తెలుసుకోండి. మీ నిజతత్త్వాన్ని మీరు తెలుసుకుంటే ఇంక ఏవిధమైన బాధలూ ఉండవు.

**(తేదీ 25.12.2003, క్రిస్మస్, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vahini vachanamrutam